మొక్కజొన్న రైతు కుదేలు!

- పంటపై తీవ్ర ప్రభావం చూపిన తుపాను
- తగ్గిన దిగుబడులు
- లభించని గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతన్నలు



ఉయ్యాలవాడలో మొక్కజొన్న దిగుబడులు చూపుతున్న రైతు ఆకుల వెంకటసుబ్బయ్య

ఉయ్యాలవాడ: మొక్కజొన్న రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసిరాలేదు. సరిగ్గా పంట చేతికొచ్చే దశలో ఎడతెరిపి లేకుండా వానలు పడటంతో ఆశలు ఆవిరయ్యాయి. పెట్టిన పెట్టుబడులు నీటి పాలయ్యాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 3 వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగైంది. అధికంగా చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వేశారు. గతేడాది ఈ పంట కలిసి రావడంతో ఎక్కువ మంది రైతులు ఈ సారి మొక్కజొన్న సాగు చేశారు. ఆది నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పైరు కంకి దశలో ఉండగా అక్టోబర్ నెలలో తుపాను ప్రభావంతో ఏకధాటిగా వారం రోజులు వర్షాలు కురిశాయి. దీంతో పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. ఉయ్యాలవాడ, ఇంజేడు, పెద్దయమ్మనూరు, రూపనగుడి, మాయలూరు, హరివరం గ్రామాల్లో ఎకరాకు 15 నుంచి 20 బస్తాలలోపు దిగుబడులు వచ్చాయి. గతేడాది ఇదే పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు 35 బస్తాలకు పైగా దిగుబడులు వచ్చాయి. దీనికితోడు మంచి ధర లభించడంతో లాభాలు వచ్చాయి. ఈసారి దిగుబడులు తగ్గిపోగా ధర కూడా లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న ధర రూ. 2,100 నుంచి రూ. 2,200 పలుకుతుంది. ఈ ధరకు అమ్మితే పెట్టిన పెట్టుబడులు కూడా రావు. దీంతో చాలా మంది రైతులు పంటను అమ్ముకోలేక..ఇంట్లో నిల్వ చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సొంత పొలం 5 ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాను. ఈ ఏడాది పంటకు గిట్టుబాటు ధర లేదు. ముందస్తు కౌలు ఎకరాకు రూ. 30 వేలు చెల్లించడం జరిగింది. దిగుబడులు 20 క్వింటాళ్లలోపే వచ్చాయి. గత ఏడాది ఎకరాకు 32 క్వింటాళ్లు వచ్చాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర క్వింటాకు రూ. 2,500 కల్పించాలి. లేకపోతే నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుంది.

– కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇంజేడు

క్లుప్తంగా

ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ప్రజా సమస్యలపై ప్రజాపోరు నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తోటమద్దులు, పుల్లానరసింహులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై ప్రభుత్వం రూ. 18 వేల కోట్ల భారం మోపుతుందన్నారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నీటిని పరీక్షిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి అవసరాలకు వాడుకుంటున్న నీటిని ఆయన పరీక్షించారు. చిన్నారులకు కాచి వడగట్టిన నీటినే తాగించాలని సూచించారు. రాత్రివేళల్లో దోమలు కుట్టకుండా తప్పనిసరిగా దోమతెరలు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విమల, ఏఎన్‌ఎం మాణిక్యమ్మ, ఆశావర్కర్లు లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు




నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం గావించారు. తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్ కుమార్, లక్ష్మీదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ, తిమ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షాహీన్, జిల్లా కార్యదర్శి మధుకిరణ్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని భువన విజయం జూనియర్ కళాశాలలో విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యాసాధనకై పోరాటాలు చేయాలన్నారు. విద్యావ్యాపారీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని చెప్పారు. దోపిడీ లేని సమాజ స్థాపనకై ఉద్యమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మధు, హరి, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

10వేల క్యూసెక్కుల నీరు విడుదల



పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 10వేల క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 10వేలు క్యూసెక్కులు ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందని చెప్పారు. తెలుగుగంగ (వీబీఆర్)కు 3వేల క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 4వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 3వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 16.5 టీఎంసీల నీరు ఉన్నట్లు వివరించారు.

బ్రాహ్మణపల్లె గ్రామ సభలో 5 దరఖాస్తులు



సభకు హాజరైన అధికారులు

నంద్యాల(అర్బన్): మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సభకు 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రియదర్శిని తెలిపారు. ఎవరూ సభకు హాజరు కాకపోవడంతో అధికారులు అర్జీదారుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రతి గ్రామ సభకు తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, ఆర్‌ఐ, వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లు హాజరు కావాల్సి ఉండగా పలు గ్రామాల్లో జరిగిన సభకు ఒకరిద్దరు అధికారులు మాత్రమే హాజరు కావడం, సచివాలయ సిబ్బంది దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. మండలంలో ఇప్పటి వరకు 16 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సభలు నిర్వహించగా అందులో మూడింటికి మాత్రమే తహసీల్దార్ హాజరు కావడంతో అధికారులు సైతం సభలకు డుమ్మా కొట్టారు. బ్రాహ్మణపల్లె గ్రామ సభలో డీటీ నాగరాజు, సర్వేయర్ సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఆయుధం



మాట్లాడుతున్న ఆకుమల్ల రహీం

నంద్యాల(అర్బన్): భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఆయుధంలాంటిదని, దీనిని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. ఓటు ద్వారా ప్రజలు తమకు కావాల్సిన మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఐక్యవేదిక జిల్లా మహాసభలో భారత రాజ్యాంగ పీఠికపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. మంచి పాలకులను ఎన్నుకున్నప్పుడే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని యువతీ యుకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



చాగలమర్రి ఎస్‌వీ కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ అబ్దుల్ సత్తార్

చాగలమర్రి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల రెవెన్యు ఇన్‌స్పెక్టర్ ఎస్.అబ్దుల్ సత్తార్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల 2వ, 4వ శని, ఆదివారాలు కొత్త ఓటరు నమోదు, పేరు, వయస్సు, అడ్రసు మార్పు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం చాగలమర్రిలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ముల్లా.షాబుద్దీన్ అధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఓ డి.హుసేన్ బాబు మాట్లాడుతూ ఓటు హక్కును గ్రామంలోని సంబంధిత బూత్ వద్ద ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల ద్వారా కానీ మీ మొబైల్ స్మార్ట్ ఫోన్‌ల ద్వారా కానీ కేంద్ర ఎన్నికల సఘం ఏర్పాటు చేసిన యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా కానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సెక్రటరీ బోద్దు పుల్లారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్, అధ్యాపకులు మహేశ్వరయ్య, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవే ఎన్‌ఆర్‌ఐల ధ్యేయం కావాలి



రాజనగరంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, తానా అధ్యక్షుడు

శిరివెళ్ల: సమాజసేవే ప్రవాసాంధ్రుల ధ్యేయం కావాలని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం రాజనగరంలో గ్రామ ఎన్‌ఆర్‌ఐ, తానా సంఘం అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 70 మంది బాలికలకు సైకిళ్లు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 35 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తమ పాఠశాలకు ప్రహరీ గోడ, క్రీడా మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎం తిరుపతిరెడ్డి ఎంపీకి విన్నవించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రుద్రవరం మండలం యర్రగుడిడిన్నెకు చెందిన కృష్ణచైతన్యకు రూ. 2.28 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు పుల్లయ్య, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, కుందూరి మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి వర్సెస్ ఎంపీ!



ఎంపీ చొరవతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు

నంద్యాల(రూరల్): నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. అధికారులు బదిలీ మొదలు ఫుట్‌పాత్‌లపై దుకాణాల ఏర్పాటు వరకు ప్రతి విషయంలో ఎంపీ జోక్యం చేసుకుంటున్నారు. ఆమె సిఫారస్సులకే మెజార్టీ అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. గత నెలలో మంత్రి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవాలు జరిగాయి. ఆ సమయంలో ఆయా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న చిన్న చిన్న దుకాణాలను మంత్రి ఆదేశాలతో నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తొలగించారు. ప్రారంభోత్సవం అనంతరం వ్యాపారులు మళ్లీ షాపులను ఏర్పాటు చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు అడ్డుకుని మంత్రితో అనుమతి తెచ్చుకోవాలని సూచించారు. దీంతో వారు పది రోజుల పాటు మంత్రి చుట్టూ తిరిగినా కరుణించకపోవడంతో ఎంపీని కలిశారు. ఆమె వెంటనే జిల్లా అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు చేసుకునే వారిని ఇబ్బంది పెడితే సహించనని, వీలైతే ఎంతటి వారితోనైనా మాట్లాడుతానని చెప్పడంతో వారు మౌనం వహించారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ బుధవారం నంద్యాల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వద్ద ఉన్న ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు.ఇంతటితో ఆగకుండా తమ సమస్యను పరిష్కరించిన ఎంపీకి ధన్యవాదాలు అంటూ ప్రకటనలు ఇచ్చారు. అంతకు ముందు తెలుగుగంగ, కేసీ కెనాల్ అధికారుల బదిలీ విషయంలో కూడా ఎంపీ మాటే చెల్లుబాటు అయింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో మంత్రి కంటే ఎంపీనే పవర్‌ఫుల్ అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఈరోజు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం (ఎన్‌పీఓఎస్‌ఏ) శనివారం కాలేజీలో జరగనుంది. కాలేజీ స్థాపించిన 1960 నుంచి ఇప్పటి వరకు చదివిన పూర్వ విద్యార్థులు, పనిచేసిన అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదువుతున్న, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

నిందితుడికి జరిమానా

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవ అనే నిందితుడికి ఆళ్లగడ్డ ఐదో అదనపు జిల్లా జడ్జి రూ.10వేల జరిమానా లేదా 3 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ వరప్రసాదు తెలిపారు. ఇటీవల గ్రామంలో చోటు చేసుకున్న గొడవలో నిందితుడిపై కేసు నమోదైంది.ఆ కేసుకు సంబంధించి నిందితుడిని కోర్టులో హాజరు పరచగా శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

తప్పిన ప్రమాదం

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడుకు చెందిన రామ్మోహన్ ఇంట్లో శుక్రవారం రాత్రి గ్యాస్‌లీక్ అయి మంటలు చెలరేగాయి. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాధితుడు తెలిపిన వివరాలు..ఇంట్లో సిలిండర్ అయిపోవడంతో నూతన సిలిండర్‌ను ఏర్పాటు చేసే క్రమంలో గ్యాస్ లీకైంది. తర్వాత మంటలు వ్యాపించడంతో బాధితుడు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశాడు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రెండు మంచాలు, ఫ్రిడ్జ్, గ్యాస్ స్టవ్ కాలిపోయాయి. స్థానికులు చాకచక్యంగా ఇంట్లోకి వెళ్లి గ్యాస్ లీకవుతున్న సిలిండర్‌ను బయటకు తెచ్చి మంటలు ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పడంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఇద్దరికి గాయాలు

బనగానపల్లె రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన శుక్రవారం బనగానపల్లె మండలం క్రిష్ణగిరి మెట్ట సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పసుపల గ్రామానికి చెందిన కవిరాజు వ్యక్తిగత పనినిమిత్తం బనగానపల్లెకు బైక్‌పై వస్తున్నాడు. మరోవైపు పాతపాడు గ్రామానికి చెందిన అశోకచక్రవరి డోన్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. డ్యూటీ నిమిత్తం మోటర్ సైకిల్‌పై పాతపాడు నుంచి వెళుతున్నాడు. క్రిష్ణగిరి మెట్ట సమీపంలోని వంతెన మలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల అనస్తీషియా వైద్యుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ఆసంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధ్యక్షుడిగా డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శిగా కాతా మధుసూదనరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధిగా నాగరాజరెడ్డి, కోశాధికారిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా శేషఫణి, మాధవి, సంయుక్త కార్యదర్శులుగా మల్లీశ్వరి, మహబూబ్‌బాషా, సంపత్‌కుమార్‌తో పాటు పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ శస్త్ర చికిత్సల్లో అనస్తీషియా వైద్యుల పాత్ర చాలా కీలకమన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గతంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం దెబ్బతినడంతో గ్రామానికి చెందిన గొటికె చిన్న బాలిరెడ్డి కుమారులు జ్యోతిరెడ్డి, ఈశ్వరరెడ్డి సహకారంతో కొత్త ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు వేద పండితుడు గుండంపాటి నరసింహ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి వంటివి నిర్వహించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు ఏవీ?



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల సర్వజన వైద్యశాలలో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. దీనికితోడు డాక్టర్ల కొరత, పరికరాల సమస్య వేధిస్తుందన్నారు. కొందరు 12గంటలకు వచ్చి సాయంత్రం 3గంటలకే వెళ్లిపోతున్నారన్నారు. రెగ్యులర్ సూపరింటెండెంట్ లేక విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి యువజన ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రఫీ, భాస్కర్, శేఖర్, అరుణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాలి

ఉయ్యాలవాడ : ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామ యూనిట్‌గా పప్పుశనగ, మండల యూనిట్‌గా వరి, జొన్న, మినుము, జిల్లా యూనిట్‌గా వేరుశనగ, ఉల్లి పంటల దిగుబడి ఆధారిత పంటల బీమాలో ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆయా పంటలు సాగు చేసిన రైతులు స్వచ్ఛందంగా పంట రుణాలు పొందిన బ్యాంకుల్లో డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. అయితే, వరి పంట సాగు చేసిన రైతులకు డిసెంబర్ 30వ తేదీ వరకు ప్రీమియం చెల్లింపు గడువు ఉందన్నారు. ఎలాంటి పంట రుణాలు పొందని రైతులు మాత్రం కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ సచివాలయాల్లో ప్రీమియం చెల్లించి రసీదులు పొందాలని ఏఓ సూచించారు.

ఉల్లి పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



తెగుళ్లు సోకిన ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్

చాగలమర్రి: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఉల్లి పంట భారీగా దెబ్బతినింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఉల్లి..రైతులు తల్లడిల్లి' శీర్షికన మంగళవారం సాక్షి కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ స్పందించి శుక్రవారం చింతలచెరువు గ్రామానికి వెళ్లి అక్కడ ఉల్లిపంటను, దిగుబడులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వర్షాలకు ఉల్లికి సోకిన ఊదా మచ్చ, కాండపు కుళ్లు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట నష్టం అంచనా వేసి పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సురేష్, పీఎంఎఫ్‌ఎం ఈడీఆర్‌పీ ఉదయ్, వీహెచ్‌ఎలు దేవేంద్ర, ఉమామహేశ్వరి, చింతలచెరువు, కొలుములపేట, శెట్టివీడు గ్రామాలకు చెందిన ఉల్లి రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాదుస్తులు అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల క్రికెట్ టీంకు పీసీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డి క్రీడాదుస్తులు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి గురువులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుశేఖర్, హెడ్‌మాస్టర్ వీర రాఘవయ్య, మాజీ ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్-13 విభాగం పోటీల్లో మహంకాళి జశ్వంత్ డబుల్స్‌లో ప్రథమ స్థానం, సింగిల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే సబ్ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జశ్వంత్ పాల్గొంటారన్నారు. జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున తదితరులు అభినందించారు.

14న జిల్లా స్థాయి సబ్ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు క్రీడాభారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ పాఠశాల చైర్మన్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పీజీ కళాశాలలో టోర్నమెంట్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలబాలికలు వేర్వేరుగా ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆధార్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 97008 02189 నంబరును సంప్రదించాలన్నారు. అండర్-13, 15 విభాగాల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరచాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడా భారతి ట్రెజరర్ రమేష్, జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బాలికలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు సెపక్‌తక్రా క్రీడలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఇటీవల కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో కావ్యశ్రీ, స్టాండ్‌బైగా అజిజాబీ అండర్-17 విభాగంలో సెపక్‌తక్రాలో ప్రతిభ చూపినట్లు చెప్పారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో సి.బెళగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్రను హెచ్‌ఎం అభినందించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు బర్న్స్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ముత్యాలపాడు బర్న్స్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సింధూర

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన బర్న్స్ ఉన్నత పాఠశాల, ఒకేషనల్ జూనియర్ కళాశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్-14, 17 విభాగాల్లో బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సింధూర తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 4వ తేదీన నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పాఠశాల అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో బర్న్స్ పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 13 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. వీరు త్వరలోనే విశాఖపట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో నంద్యాల తరఫున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బార్నబస్, సిబ్బంది కుందవరం భాస్కర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.